
సాక్షి ఒడిశా

శనివారం । 8 । ఏప్రిల్ । 2023





**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,53,143లు, బంగారం 1.89 గ్రాములు, వెండి 105 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



**మౌరిరాజు తొలిపూజలు**

-10లో▸



**ప్రజాందోళనతో రైళ్లు రద్దు**

-10లో▸

## న్యూస్‌రీల్

### 5క్వింటాళ్ల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల ఐఐసీ సూర్య ప్రకాష్ నాయక్ తన సిబ్బందితో కలిసి కూర్మనూర్ పంచాయతీ పరిధిలో గురువారం రాత్రి పెట్రోలింగ్ చేపట్టారు. అదే సమయంలో సమీపంలోని అడవిలో 20బస్తాల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను గమనించిన దుండగులు వాహనాన్ని వదిలి, పరారయ్యారు. గంజాయిని శుక్రవారం ఉదయం తూకం వేయగా, 504 కిలోలు ఉంది. దీనివిలువ రూ.30 లక్షలు ఉంటుందని ఐఐసీ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, పరారైన వారి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

### నకిలీ ధ్రువపత్రాల కేసులో నలుగురి అరెస్ట్



నకిలీ ధ్రువపత్రాలతో అరెస్టయిన నిందితులు

జయపురం: తపాలా విభాగంలో గ్రామీణ డాక్ సేవకులు, బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, సహాయ బ్రాంచ్ మాస్టర్ల ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో 22మంది నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన కేసులో నలుగురు నిందితులను జయపురం పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరంతా నవరంగపూర్ జిల్లా రాయఘర్‌కు చెందిన గోపాలకృష్ణ పట్నాయక్, కొడింగ సమితిలో దినా హరిజన్, కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి లులుపొదర్ గ్రామానికి చెందిన సారథి హల్వా, మల్కన్‌గిరి జిల్లా పేపరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధి కిషోర్ ఖొరాగా గుర్తించామని పోలీసు అధికారి సంబిత్‌కుమార్ బెహరా వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరు పరిచామని, అనంతరం జైలుకు తరలించామని వివరించారు.

### కానిస్టేబుల్ బలవన్మరణం



చెట్టుకు వేలాడుతున్న సుశాంత్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ-42 గ్రామం వద్ద ఉన్న చెట్టుకు కానిస్టేబుల్ సుశాంత్ హల్దార్(33) ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతని జేబులో 7సూసైడ్ నోట్‌లను పోలీసులు గుర్తించారు. మృతుడిని నవరంగ్‌పూజ్ జిల్లా ఉమ్మర్‌కోట్ కాగా, ఎంవీ-42 గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. గురువారం అత్తవారి ఇంటికి వచ్చిన అతను.. శుక్రవారం ఉదయం ఇలా చెట్టుకు వేలాడుతూ కనిపించాడని గ్రామస్తులు తెలిపారు. దీనిపై మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఐఐసీ రీగాన్‌కీండో సిబ్బందితో సహా అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఉమ్మర్‌కోట్ తరలించి, అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ఎంసీసీ అమలులో ఎన్నో పథకాలు



మాట్లాడుతున్న సీడీఎంఓ డాక్టర్ పీకే పాత్రొ

పర్లాకిమిడి: ప్రభుత్వ ఆస్పత్రులలో చేరిన గర్భిణులు, నవజాత శిశువులు, బాలింతలకు ఎంసీసీ కార్డు(తల్లి, బిడ్డ సంరక్షణ)ను ఏడేళ్ల వరకు ఉచితంగా అందిస్తున్నామని జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రొ తెలిపారు. అలాగే ప్రతి బుధవారం వివిధ టీకాలు అందిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాతపట్నం రోడ్డులోని శ్రీధర్‌నగర్‌లో ఉన్న సెంటర్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్(సీసీడీ) కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీపీహెచ్ సీఓ నేత్రానంద శత్పతి, సీసీడీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అడ్డాల జగన్నాథరాజు, మహిళా సొసైటీ అధ్యక్షురాలు ఎ.పద్మారాజ్ పాల్గొన్నారు.

## • సందడిగా శోభాయాత్ర



ఊరేగింపులో పాల్గొన్న అగ్రసేన్ సమితి సభ్యులు

హనుమాన్ జయంతి ఉత్సవం సందర్భంగా జయపురం లోని అగ్రసేన్ సమితి ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. సుందరంగా అలంకరించిన రథంపై హనుమాన్ చిత్రపటాన్ని ప్రతిష్టించి, పట్టణంలోని రాజనగర్ కూడలి నుంచి మెయిన్ రోడ్డు, సర్దార్ పటేల్ మార్గం మీదుగా నెహ్రూనగర్ లోని అగ్రసేన్ భవనానికి చేరుకున్నారు. అక్కడే ఉన్న హనుమాన్ మందిరంలో పూజలు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొనగా, అనంతరం అన్నదానం చేపట్టారు. ఊరేగింపులో అగర్వాల సామాజిక కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అగ్రసేన సమితి అధ్యక్షుడు దీనబంధు అగర్వాల, ఉపాధ్యక్షుడు రొహితేష్ మతానియా, కార్యదర్శి రాజకిషోర్ అగర్వాల్, కోశాధ్యక్షుడు సురేష్ జైన్, రామావతార గుప్తా తదితరులు పాల్గొన్నారు. - జయపురం

## • సరికొత్త సౌకర్యాలు..

అంచెలంచెలుగా అభివృద్ధి దిశలో పయనిస్తున్న రాయగడ రైల్వేస్టేషన్ పరిసరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో రైల్‌కోచ్ రెస్టారెంట్ ఏర్పాటుకు ఆశాఖ అధికారులు సన్నహాలు చేస్తున్నారు. విశాఖపట్నం రైల్వే డివిజనల్ మేనేజర్ అనూప్‌కుమార్ శత్పతి గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడ జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం నాణ్యత గల ఆహారం, టిఫిన్, ఇతర పదార్థాలను సరసమైన ధరల్లో అందించాలనే ఉద్దేశంతో రైల్వేస్థలంలో రైల్‌కోచ్ రెస్టారెంట్ ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. దీనిని త్వరలో ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైల్‌కోచ్ రెస్టారెంట్‌ను వివాహాది శుభ కార్యక్రమాల్లో భాగంగా భోజనాలు, టిఫిన్ వంటివాటి కోసం ముందుగా బుక్ చేసుకుని, రిజర్వ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నట్లు డీఆర్‌ఎం వివరించారు. - రాయగడ




రైల్‌కోచ్ రెస్టారెంట్ నమూనా

## • సంప్రదాయం కొనసాగింపు..




ఆభరణాలను ట్రెజరీకి తరలిస్తున్న ట్రస్ట్ సభ్యులు

రాయగడ మజ్జిగౌరి చైత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారి బంగారు ఆభరణాలను ఆలయ కమిటీ ప్రతినిధులు జిల్లా ట్రెజరీ కార్యాలయానికి తరలించారు. మందిర వార్షిక ఉత్సవాల నుంచి వీటిని మార్చి 31న ట్రెజరీ నుంచి తీసుకు వచ్చారు. అనంతరం సొనొబెసో అలంకరణలో అమ్మవారు 5రోజుల పాటు భక్తులకు దర్శనమివ్వడంతో పాటు ప్రత్యేక పూజలందుకున్నారు. ఉత్సవాలు ముగియడంతో సంప్రదాయాన్ని కొనసాగిస్తూ తిరిగి భద్రంగా తీసుకువెళ్లారు. పోలీసు బందోబస్తు మధ్య అమ్మవారి మందిరానికి చెందిన బస్సులో వాటిని సురక్షితంగా చేర్పించారు. కార్యక్రమంలో మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసి రాజు, దేవేంద్ర బెహరా, అర్చకులు పాల్గొన్నారు. - రాయగడ

# ఊహాగానాలకు తెర

- రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలపై జోరుగా ప్రచారం
- ఇటీవల పూరీకి ఈవీఓంలు చేరుకోవడంతో వదంతులకు ఆజ్యం
- అపోహలే అంటూ కొట్టి పారేసిన ప్రధాన ఎన్నికల కార్యాలయం



ఓటింగ్ వేసేందుకు బారులు తీరిన జనం(ఫైల్)



ఈనెల 4న పూరీ చేరుకున్న ఈవీఎంలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలపై ఊహాగానాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం స్పందించింది. రాష్ట్రానికి ఇటీవల కొత్త ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం) సరఫరా అయ్యాయి. దీంతో లోక్‌సభ, శాసనసభ ఎన్నికల సమయం దగ్గర పడిందని, ఈసారి ముందస్తుగా ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. కొత్త ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం) చేరుకోవడంతో ముందస్తు ఎన్నికలపై మరిన్ని వదంతులు వ్యాప్తించాయి. అయితే ఇదంతా పొంతనలేని అంశంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం శుక్రవారం కొట్టి పారేసింది. ముందస్తు ఎన్నికల అపోహ నుంచి మేలుకోవాలని హితవు పలికింది. ఈవీఎంలకు నిర్ధారిత జీవితకాలం ఉంటుందని, ఫ్యాక్టరీలో తయారు చేసిన ఈవీఎంలను భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో ఉపయోగించేందుకు ఒడిశాతో సహా దేశంలోని వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) నుంచి తొలి దశలో రాష్ట్రానికి 8,200 కొత్త ఈవీఎంలు సరఫరా అయ్యాయని వెల్లడించారు. వీటిని పూరీ తొలొబొణియా స్ట్రాంగ్




రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం

రూమ్‌లో భద్ర పరిచామని, ఈ ప్రక్రియకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యక్షంగా హాజరయ్యారన్నారు. ఇదంతా సాధారణ వ్యవహారంలో భాగంగానే జరిగిందని స్పష్టంచేశారు.

**ధర్మేంద్ర ప్రధాన్ సైతం..**

రాష్ట్రంలోని 147అసెంబ్లీ, 21లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒకేసారి సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని రాష్ట్ర ఎన్నికల కార్యాలయం ప్రకటించింది. ఈ ఎన్నికల కోసం దాదాపు 37,100 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఈ కేంద్రాల్లో ఓటింగ్ కోసం దాదాపు 95వేల ఈవీఎంలు అవసరం వివరించింది. భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) ఆదేశాల మేరకు ఎన్నికలకు అవసరమైన ఈవీఎంల కంటే రెట్టింపు సంఖ్యలో ఈవీఎంలు కొనుగోలు చేస్తామన్నారు. ఉత్పాదన కంపెనీ నుంచి రాష్ట్రాలు ప్రత్యక్షంగా కొనుగోలు చేస్తాయని వివరించారు. మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, నవరంగ్‌పూర్, కలహండి, నువాపడ, బలంగీర్, సోన్‌పూర్, మయూర్‌భంజ్, కెంజొహర్ ప్రాంతాలకు త్వరలో కొత్త ఈవీఎంలు సరఫరా అవుతాయని తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు వివిధ రాష్ట్రాలకు కొత్త ఈవీఎంలను కొనుగోలు చేసేందుకు బడ్జెట్‌లో దాదాపు రూ.1,900లు కోట్లు కేటాయించడం గమనార్హం. గత ఏడాది డిసెంబర్‌లో రాష్ట్రంలో ముందస్తు(2024కి ముందు) అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభిప్రాయం వ్యక్తంచేశారు. దీనికి తోడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు రాష్ట్రానికి చేరడంతో ముందస్తు ఎన్నికల ఊహాగానాలకు ఆస్కారం ఏర్పడింది.

# ముగిసిన నవమి ఉత్సవాలు



పర్లాకిమిడి: పట్టాభిషేకంలో స్వామివారు



శ్రీరాముని పట్టాభిషేకంలో పాల్గొన్న భక్తులు

భువనేశ్వర్: ఖుర్దారోడ్‌లో రామ నవమి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ట్రాఫిక్ కాలనీ రామమందిరంలో శుక్రవారం శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. మార్చి 30న నవమి మొదలుకొని నిత్యం ప్రత్యేక పూజాదులు జరిగాయి. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువుగా జరిపారు. ఆలయ అర్చకులు ఎంవీ రమణ పర్యవేక్షణలో నిత్య, ఉత్సవ పూజాదులతో ఏకాహం, ఆంజనేయ ఆకుపూజ, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఖుర్దారోడ్ రైల్వే మండంలో సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ దేవాలయం బహుముఖ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మందిరం భక్తసమాజ్ కమిటీ అధ్యక్షుడు ఎం.గోపాలరావు, కార్యదర్శి ఎ.తిరుమలరావు తెలిపారు.

**పర్లాకిమిడిలో..**

పర్లాకిమిడి: పట్టణంలోని మార్కెట్ వీధిలో శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాల్లో ముగిశాయి. ఇందులో భాగంగా శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకాన్ని అర్చకులు ఎ.రాజగోపాలాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకోవడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

# ప్రతిభ చూపిన ఐటీఐ విద్యార్థులు



జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ పాణిగ్రహి

బరంపురం: నగరంలోని ప్రభుత్వ ఐటీఐకి చెందిన 36మంది విద్యార్థులు చెన్నైలోని టీవీఎస్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారు. ఈ నేపథ్యంలో వారంతా స్థానిక క్యాంపస్ నుంచి ప్రత్యేక బస్సులో చెన్నై బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రజత్ పాణిగ్రహి మాట్లాడుతూ వారం క్రితం చెన్నైలోని టీవీఎస్ కంపెనీ ప్రతినిధులు బరంపురం ఐటీఐ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. ఇందులో 36మంది ప్రతిభ చూపి, ఎంపికయ్యారని వెల్లడించారు. తొలి దఫాలో వారంతా కొద్దిరోజుల శిక్షణ నిమిత్తం చెన్నై వెళ్తున్నట్లు వివరించారు.

# పొనా సంబరాలు ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న మహిళలు



సంప్రదాయ వస్త్రాలంకరణలో మహిళలు

రాయగడ: ఒడియా ప్రజల నూతన సంవత్సరాది పొనా సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. స్థానిక గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న ఈ సంబరాల్లో భాగంగా మహిళల మధ్య వివిధ క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవ కమిటీ సభ్యురాలు, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ శుభ్ర పండా ఆధ్వర్యంలో స్థానిక మహిళా కళాశాల ప్రాంగణంలో కట్టు, బొట్టు, ఒడియా సాంప్రదాయం అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్కళ సంప్రదాయాన్ని గౌరవించే విధంగా కట్టుబొట్టుతో మొదటి బహుమతిని సంజుక్త మిశ్రా ప్రథమ బహుమతి గెలుపొందారు. ప్రదీప్తా దాస్ ద్వితీయ, అంజలి దాస్ తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నిరంజన్ బక్షీ పాత్రొ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంప్రదాయాలు, భాష, సంస్కృతిని పరిరక్షించుకునే విధంగా అంతా కృషి చేయాలని కోరారు. ఇటువంటి సంబరాలు భావితారాలకు పునాదులుగా మారాలని హితవు పలికారు. ఇతర సంస్కృతులను గౌరవించడం తోపాటు మన భాష, సంస్కృతిని మరచిపోకూడదని, దీనికి యువత తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో దేవాశీష్ ఖడంగ తదితరులు పాల్గొనగా, డాక్టర్ డీకే మహంతి, అర్చనా పట్నాయక్, జగదీష్‌చంద్ర దొరా న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

## కన్న కొడుకుని అమ్మేసిన తండ్రి!

భువనేశ్వర్:

కన్న కొడుకుని తండ్రే సంతలో అమ్మేసిన ఘటన రాష్ట్రంలో కలకలం రేపుతోంది. దీనిపై చేపట్టిన విచారణలో ఈ విషయం నిర్ధారణ ఖరారు కానట్లు అనుబంధ వర్గాలు తెలిపాయి. జాజ్‌పూర్ జిల్లా బొడొచొణ ప్రాంతం తలెత్తిన ఈ వివాదానికి సంబంధించి స్థానిక పోలీసులు 10 ఏళ్ల బాలుడిని అదుపులోకి తీసుకుని, కన్నతల్లికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే... సొసన్ పురుసోత్తంపూర్‌కు చెందిన ఘునా సికు 2రోజుల క్రితం అరుహా సంతకు వెళ్లి, అక్కడ ఓ వ్యక్తికి తన కొడుకుని విక్రయించినట్లు సమాచారం. దీనిపై అతని భార్య సంగీత సికు దీనిని తీవ్రంగా వ్యతిరేకించి, స్థానికుల సాయంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి నిరంజన్‌కర్‌కు సమాచారం అందించారు. అనంతరం బొడొచొణ పోలీసుల బృందం బాలుడిని రక్షించి, గురువారం రాత్రి తల్లికి అప్పగించింది. కొడుకును విక్రయించి, భర్త సంపాదించిన డబ్బు గురించి తనకేమీ తెలియదని ఆమె తెలిపింది. ఈ నేపథ్యంలో జిల్లా బాలల సంరక్షణ కార్యాలయం 'అమ్మొ ఘొరొ శిశు జొత్నొ' గృహసంస్థకు లేఖ జారీ చేసింది. ఈ సంస్థ కార్యకర్త రాజేంద్రకుమార్ శత్పతి గ్రామాన్ని సందర్శించారు. బాలుడిని అతని తండ్రి విక్రయించాడో లేదో వివరణ లేదు. ఈ విషయమై పోలీసుల విచారణ కొనసాగుతోంది. తండ్రి కొడుకుని విక్రయించిన విషయం ధ్రువీకరణ జరగనట్లు ఈ వర్గాలు తెలిపాయి.

## • వికటించిన శస్త్రచికిత్స



ఆస్పత్రి ప్రధాన గేటు ముందు ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

- మహిళ మృతిపై ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు



వైద్యులతో మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

జయపురం: పట్టణంలోని కొరాపుట్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గురువారం సాయంత్రం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటున్న సమయంలో ఓ మహిళ మరణించింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని ఆమె బంధువులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి ఆస్పత్రికి వెళ్లి, బాధితులతో చర్చించడంతో ఆందోళన విరమించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కొరాపుట్ జిల్లా లమతాపుట్ సమితి గులేల్ గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు ఆశా కార్యకర్త జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారితో కలిపి మొత్తం 29మందికి ఆపరేషన్లు చేసేందుకు వైద్యులు సిద్ధమయ్యారు. వాటిలో 27మందికి విజయవంతంగా కాగా, లమతాపుట్ సమితి జోలాపుట్ ప్రాంతానికి చెందిన సూర్యతేజ బొడనాయక్(35)కు శస్త్రచికిత్స ప్రారంభించిన కొద్దిసేపటికే ఊపిరాడక మరణించింది. విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేయగా, భర్త రామరాజు బొడనాయిక్ బంధువులతో సహా ఆస్పత్రికి చేరుకున్నారు. ఆపరేషన్ సమయంలో డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే సూర్యతేజ మరణించిందని ఆరోపిస్తూ ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద ఆందోళనకు దిగారు. ఘటనపై దర్యాప్తు జరపాలని, బాధిత కుటుంబానికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సదర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కలెక్టర్ అనుమతి మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మేజిస్ట్రేట్ సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయడంతో పాటు ఈ ప్రక్రియ నిర్వహిస్తామని పోలీసు అధికారి ఈశ్వర తండి హామీ ఇచ్చారు. అలాగే దర్యాప్తు కొనసాగించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో వారంతా ఆందోళన విరమించారు.

## క్లుప్తంగా

### 175 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

**పర్లాకిమిడి:** గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ మర్లబా ఘాటీ వద్ద పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అటుగా వస్తున్న వాహనం పై భాగంగా సోదా చేయగా, 175కిలోల గంజాయి పట్టుబడింది. దీనిని తరలిస్తున్న వాహనం డ్రైవర్ గంజాం జిల్లా పుడామర్రి గ్రామానికి చెందిన పవిత్రాగౌడ్‌ను అరెస్ట్ చేశారు. పట్టుబడిన సరుకు విలువ సుమారు రూ.17.50 లక్షలు ఉంటుందని అంచానా వేశారు. జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభాత్ శెఠి ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించామని సిబ్బంది తెలిపారు.

### సేంద్రియ ఎరువులతో ప్రయోజనం



సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న విద్యార్థులు

**రాజాం సిటీ:** సేంద్రియ ఎరువులతోనే పంటలకు ఎంతో మేలు జరుగుతుందని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. మండల పరిధిలోని పొగిరి గ్రామంలో సేంద్రియ ఎరువులు ప్రదర్శిస్తూ వాటివలన కలిగే ప్రయోజనాలను శుక్రవారం రైతులకు వివరించారు. వర్మీకంపోస్టు, జీవామృతం, పంచగవ్య, తదితర సేంద్రియ ఎరువులు సొంతంగా తయారు చేసుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు సీహెచ్ఎస్‌జే ప్రసన్న, కె.సాహితీ, కె.స్నేహిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### భోగాపురంలో ప్రబలిన డెంగీ



చిన్నవీధిలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

**భోగాపురం:** మండల కేంద్రంలోని చిన్నవీధికి చెందిన ముద్దు భానుప్రకాష్ (11) డెంగీ బారిన పడ్డాడు. బాలుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చిన్నారికి గత నెల 30వ తేదీన జ్వరం వచ్చింది. దీంతో తల్లిదండ్రులు బాలుడిని సుందరపేటలో ఉన్న సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. వైద్యులు బాలుడిని పరీక్షించి, మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఘోషా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి బాలుడికి డెంగీ సోకినట్లు నిర్ధారించారు. దీంతో పోలిపల్లి పీహెచ్‌సీ సిబ్బంది మండల కేంద్రంలోని చిన్నవీధికి చేరుకుని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేయడంతో పాటు బ్లీచింగ్ పిచికారీ చేశారు.

### వృద్ధుడి ఆత్మహత్య



దేముడు మృతదేహం

**జామి:** పురుగుల మందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. జామి గ్రామానికి చెందిన వాక దేముడు(68) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పక్షవాతం తదితర అనారోగ్య సమస్యలతో జీవితం మీద విరక్తి చెంది శుక్రవారం ఉదయం కళ్లాంలో పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులకు విషయం తెలియడంతో 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కోడలు శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏఎస్‌ఐ నరసింగరావు కేసు నమోదు చేశారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

**విజయనగరం ఫోర్ట్:** ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముర్రు జయచంద్రనాయుడు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఐఎంఏ ఆధ్వర్యంలో కోటకూడలి నుంచి గంటస్తంభం వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుని జీవన శైలిలో వచ్చిన మార్పులవల్ల బీపీ, సుగర్, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు ప్రతిఒక్కరూ ప్రయత్నించాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం, మంచి పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండి కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు వంటివి తినాలన్నారు. మానసిక ప్రశాంతత అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసిసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి, డాక్టర్ తిరుమలప్రసాద్, డాక్టర్ మహేంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.



తొలిపూజకు తరలివెళ్తున్న మాబుడి శాంతమ్మ



పిన్నిగారి ఇంటికి చేరుకుంటున్న దృశ్యం



దీపారాధన చేస్తున్న భక్తులు

# మౌరిరాజు తొలిపూజలు

- మాబుడి శాంతమ్మకు పూజలు చేసిన నరేంద్రదేవ్
- ఘటయాత్రతో పిన్నిగారి ఇంటికి చేరుకున్న అమ్మవారు

**బరంపురం:** దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధి చెందిన మాబుడి శాంతమ్మ సంబరాలు మూడో రోజుకు చేరుకున్నాయి. భక్తజన సందోహంతో సంబరాలు జోరందుకున్నాయి. రోజూ వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. సంప్రదాయం ప్రకారం ఘటయాత్ర సాయంత్రం ప్రారభమైంది. సంబరాల నిర్వహుకులు దేశిబెహరా దుర్గాప్రసాద్ సతీమణి పాత్రర్ల రేవతి అమ్మవారి ప్రధాన ఘటంతో ఆలయ ప్రాంగణం నుంచి భయలు దేరి మౌరిరాజు కోటకు చేరుకున్నారు. అక్కడ రాజు నరేంద్రదేవ్ నుంచి అమ్మవారు తొలిపూజలు అందుకున్నారు. అనంతరం నగరంలోని మంగళవారం పేటలో నివాసం ఉంటున్న అమ్మవారి పిన్నిగారి ఇంటికి వెళ్లారు. అనంతరం పలు వీధుల్లో ఘట పరిక్రమణ ఊరేగింపు సాగింది. ముందుగా జ్వాలాముఖి, కోళాకుంజిల నృత్యం, వాయిధాల మధ్య ఘనంగా సాగింది. అనంతరం ఘటాలు తిరిగి దేశిబెహరా వీధిలోని తాత్కాలిక ఆలయానికి చేరుకున్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీసు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.



దర్శించుకుంటున్న మౌరిరాజు నరేంద్రదేవ్



అమ్మవారి సన్నిధిలో ఆకట్టుకుంటున్న బాలల వేషధారణ

# దేదీప్యం బ్రహ్మోత్సవం

**భువనేశ్వర్:** ఖుర్దారోడ్ అకౌంట్స్ కాలనీ బాలాజీ బ్రహ్మోత్సవాలు దేదీప్యంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పట్టణ వీధుల్లో స్వామివారు శుక్రవారం హనుమ వాహనంలో ఊరేగారు. దేవస్థానం ప్రాంగణంలో అభయ ఆంజనేయుని విశాల విగ్రహం పరిసరాల్లో ఆంజనేయ సహస్ర నామార్చన, హనుమాన్ చాలీసా పారాయణంతో నింభఫల అర్చన, సింధూరార్చన, ఆకుపూజ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన దీపాలంకరణ, దర్బారు సేవ, ఊంజల సేవ, సౌభాగ్యలక్ష్మి కుంకుమార్చన భక్తులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజాదుల విశిష్టత వ్యాఖ్యానంలో పంతుల రఘునాథ శాస్త్రి, రంగాభట్ల ధనుంజ ఆచార్యులు పాల్గొన్నారు. సౌభాగ్య లక్ష్మి కుంకుమార్చనలో 160మంది మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సామూహిక లలిత సహస్రనామ పారాయణంతో ఈ పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణం తాత్కాలిక కొలనులో శ్రీదేవి, భూదేవి సమేతంతా శ్రీనివాసుని తెప్పోత్సవం అత్యంత ఆనందోత్సాహాలతో జరిగింది.



ఉభయ దేవేరులతో శ్రీనివాసుని తెప్పోత్సవం



సౌభాగ్య లక్ష్మి కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

### మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**వంగర:** మండల పరిధి పాతమరువాడ బస్సు షెల్టర్ వద్ద అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి అప్పలనాయుడు 108 మద్యం బాటిళ్లను తీసుకువెళ్తుండగా పట్టుకున్నామని ఎస్‌ఐ వెల్లడించారు. కేసు నమోదు చేసి వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు.

### ఆత్మ విశ్వాసంతోనే లక్ష్య సాధన

**రాజాం సిటీ:** ప్రతి ఒక్కరు ఆత్మవిశ్వాసం, పట్టుదలతోనే లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చునని జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఆర్‌జేడీ పీవీ కృష్ణాజీ అన్నారు. ఇందుకు ఉదాహరణే ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో నిర్వహించిన 5వ జాతీయ స్థాయి పారా బ్యాడ్మింటన్‌లో బంగారు పతకాన్ని గెలుపొందిన పడాల రూపాదేవి అని కొనియాడారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు స్కూల్ ఆవరణలో రూపాదేవికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు అంగవైకల్యం ఏర్పడినప్పటికీ ఎక్కడా తన ఆత్మవిశ్వాసం కోల్పోకుండా లక్ష్య సాధనకు అడుగులు వేస్తుందన్నారు. జీవితంలో మరెన్నో విజయాలు సొంతం చేసుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం సన్మాన గ్రహీత మాట్లాడుతూ తను ఈ స్థితిలో ఉన్నప్పటికి ఎప్పుడు కుంగిపోలేదని అన్నారు. తల్లి యశోదతో పాటు రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్ఎల్‌టీఎస్ అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు నన్నెంతగానో ప్రోత్సహించారని గుర్తు చేశారు. లక్ష్య సాధనలో ఎన్నో ఆటుపోట్లు ఎదురౌతాయని వాటిని అధిగమించినప్పుడే విజయాలు సొంతమౌతాయని పేర్కొన్నారు.

# ప్రజాందోళనతో రైళ్లు రద్దు

**భువనేశ్వర్:** ఆగ్నేయ రైల్వే పరిధిలో ఖేమసులీ, కస్తార్ రైల్వే స్టేషన్లలో ప్రజా ఆందోళన ప్రభావం పలు ప్రాంతాల్లో రైలు రవాణా చూపింది. ఆందోళన దృష్ట్యా పలు రైలు సేవలను రద్దు చేయగా, మరికొన్నిటిని దారి మళ్లించి నడిపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 8న(శనివారం) పలు రైలుసేవను ప్రారంభ స్టేషన్ నుంచి రద్దు చేస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. అలాగే 18477/18478 పూరీ-రుషీకేష్-పూరీ కళింగ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ ఉభయ దిశల్లో దారి మళ్లించారు. ఇది సంబల్‌పూర్ సిటీ-ఝార్సుగుడ రోడ్-ఈబ్ స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

**రద్దయిన రైళ్ల వివరాలు**

22606 విల్లుపురం-పురులియా ఎక్స్‌ప్రెస్(విల్లుపురం నుంచి), 12375 తాంబరం-జసిడిహ్ ఎక్స్‌ప్రెస్ (తాంబరం నుంచి), 12801 పూరీ-న్యూఢిల్లీ పురుసోత్తం ఎక్స్‌ప్రెస్(పూరీ నుంచి), 12802 న్యూఢిల్లీ-పూరీ పురుసోత్తం ఎక్స్‌ప్రెస్(న్యూఢిల్లీ నుంచి), 12871 హౌరా ఇస్పాత్ ఎక్స్‌ప్రెస్(టిట్లాగఢ్ నుంచి), 22862 హౌరా-కంటాబంజి ఇస్పాత్ ఎక్స్‌ప్రెస్(హౌరా నుంచి), 18006 జగదల్‌పూర్-హౌరా సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్(జగదల్‌పూర్ నుంచి), 18005 హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్(హౌరా నుంచి), 22824 న్యూఢిల్లీ-భువనేశ్వర్ రాధాని ఎక్స్‌ప్రెస్(న్యూఢిల్లీ నుంచి), 20817 భువనేశ్వర్-న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్(భువనేశ్వర్ నుంచి). 13352 అలెప్పీ-ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్(అలెప్పీ నుంచి)

**ఇతర తేదీల్లో రద్దవుతున్న రైళ్లు**

9న ఎల్‌టీటీ నుంచి 12145 ముంబై ఎల్‌టీటీ-పూరీ ఎక్స్‌ప్రెస్, 11న పూరీ నుంచి 12146 పూరీ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, 10న న్యూ టిన్సుకియా నుంచి 15930 న్యూ టిన్సుకియా-తాంబరం ఎక్స్‌ప్రెస్, 10న తాంబరం నుంచి 15629 తాంబరం-సిల్ఘాట్ టౌన్ ఎక్స్‌ప్రెస్

# ప్రేమ విఫలమై.. ఒడిశా కూలీ ఆత్మహత్య

- కశింకోటలో ఇటుక బట్టీ పనులకు వచ్చి అఘాయిత్యం

**కశింకోట (అనకాపల్లి జిల్లా):** ప్రేమలో విఫలమైన ఒడిశా కూలీ మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కశింకోటలోని శారదానది అవతల ఇటుకల బట్టీ ప్రాంతంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి వివరాల ప్రకారం.. ఒడిశాలోని కోర్లమాల్ గ్రామానికి చెందిన గోవర్ధన్‌బాగ్(21) మూడు నెలల క్రితం అక్కడి అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నించగా, అందుకామె నిరాకరించింది. దీంతో కశింకోటలోని శారదానది సమీపంలోని ఇటుకల బట్టీలో పని చేయడానికి ఒడిశా నుంచి వచ్చి నెల రోజులు తర్వాత తిరిగి స్వగ్రామానికి వెళ్లాడు. అక్కడ మళ్లీ ప్రేమికురాలితో ప్రేమను సఫలీకృతం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేసినా ఫలించలేదు. ఈ క్రమంలో తల్లిదండ్రులు నజ్జచెప్పడంతో మళ్లీ కశింకోట ఇటుకల బట్టీలో పనికి ఇటీవల వచ్చాడు. అప్పటి నుంచీ ప్రేమికురాలిపై ధ్యాస పోలేదు. సెల్‌ఫోన్ ద్వారా ప్రయత్నించినప్పటికీ ఆమె నుంచి స్పందన కరవైంది. దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తండ్రి చమురుబాగ్‌కు ఫోన్లో గురువారం రాత్రి సమాచారం అందించాడు. అనంతరం బట్టీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, ఇటుకల బట్టీ యజమాని పి.చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేయడంతో పాటు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



గోవర్ధన్‌బాగ్ మృతదేహం

# సైనికా సెలవిక..



కొడుకు పార్థివదేహానికి వస్త్రాలను సమర్పిస్తున్న తల్లి లక్ష్మి. (ఇన్‌సెట్లో) చందక గోవింద్ (ఫైల్)

**చీపురుపల్లి రూరల్:** గోవింద్ అమర్ రహే... సైనికా సెలవిక అంటూ చీపురుపల్లి ప్రాంత ప్రజలు కన్నీటి నివాళులర్పించారు. విధి నిర్వహణలో మరణించిన ఇండియన్ నేవీ మెరైన్ కమాండో చందక గోవింద్(29) మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోధించారు. పర్ల గ్రామంలో సైనిక అధికార లాంఛనాల నడుమ శుక్రవారం జరిగిన అంత్యక్రియల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇండియన్ నేవీ మెరైన కమాండోగా విధులు నిర్వహిస్తూ కోల్‌కతాలో జరిగిన పారాచ్యూట్ శిక్షణలో ప్రమాదవశాత్తు బుధవారం సాయంత్రం గోవింద్ మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహం ఉదయం 8 గంటల సమయానికి సైనిక్ వాహనంలో చీపురుపల్లి-విజయనగరం ప్రధాన రోడ్డులోని పెనుబర్తి కూడలికి చేరుకుంది. అక్కడి నుంచి భౌతికకాయంతో వేలాది సంఖ్యలో యువత జాతీయజెండాలతో గోవింద్ అమర్‌రహే అంటూ వెంటనడిచారు. జాతీయ జెండాలతో గరివిడి, చీపురుపల్లి పట్టణాల ప్రధాన రోడ్డు మీదుగా రెడ్డిపేట, విజయరాంపురం, శివరాం గ్రామాల మీదుగా స్వగ్రామం పర్ల గ్రామానికి చేరుకున్నారు.

**నాయనా.. విడిచి వెళ్లిపోతున్నావా..**

నాయనా.. ఇంటికి పెద్దదిక్కుగా ఉంటావనుకుంటే.. మధ్యలోనే మమ్మల్ని విడిచి వెళ్లిపోతున్నావా అంటూ గత మూడు రోజులుగా కొడుకు కడచూపు కోసం ఎదురుచూస్తున్న తల్లి లక్ష్మి రోదనలు అందరి కళ్లల్లో కన్నీరును తెప్పించాయి. సోదరీసోదరుడు గుండెలవిసేలా రోదించారు. గతేడాది తండ్రి మరణించగా ఏడాది గడువులో ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారుడు వీరమరణం పొందడంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

**సైనిక లాంఛనాలతో..**

గోవింద్ భౌతికకాయం గురువారం రాత్రికి విశాఖపట్నం తూర్పుతీర నావికాదళ ప్రధాన కేంద్రానికి చేరుకుంది. నేవీ అధికారులు పూలతో అలంకరించిన సైనిక్ వాహనంలో మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. నేవీ సిబ్బందే స్వయంగా శ్మశానవాటికకు మృతదేహాన్ని మోసుకుని తీసుకెళ్లారు. నేవీ ఉన్నతాధికారులు, సిబ్బంది, జిల్లా రిజర్వ్ పోలీసదళం నడుమ సైనిక లాంఛనాలతో గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి అంతిమ వీడ్కోలు పలికారు.

### గోవింద్ కుటుంబాన్ని ఆదుకుంటాం..



సైనికుడి భౌతిక కాయానికి సెల్యూట్ చేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

విధి నిర్వహణలో వీరమరణం పొందిన గోవింద్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి తెలిపారు. గ్రామంలో శ్మశానవాటిక వద్ద పార్థివదేహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. గోవింద్ తల్లి లక్ష్మిని ఓదార్చారు. కుటుంబానికి రావాల్సిన అన్ని సదుపాయాలు వచ్చేలా మంత్రి గారితో మాట్లాడి వచ్చేలా చూస్తామన్నారు. ఆ కుటుంబానికి మంజూరు చేయాల్సిన అన్ని ధ్రువపత్రాలను త్వరితగతిన అందేలా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నేవీ ఐఎన్ఎస్ కర్ణ విభాగం కెప్టెన్ చేతన్ ఆర్.ఉపాధ్యాయతో మాట్లాడి కుటుంబానికి రావాల్సిన అన్ని ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరారు. అంతిమ వీడ్కోలులో వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దన్, ఇప్పిలి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం



సాలూరు: జీగిరాంలో నేల వాలిన మొక్కజొన్న పంట

**వంగర:** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి గాలివానతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు వడగళ్ల వర్షం పడింది. గాలుల బీభత్సానికి మద్దివలస, తలగాం, వీవీఆర్‌పేట గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ఎం.సీతారాంపురం ఫీడర్‌లోని పలు గ్రామాలకు ఒక్క రోజు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాన్స్‌కో ఏఈ కోనూరు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపట్టి విద్యుత్ పునరుద్ధరించారు. గాలుల బీభత్సానికి పలు గ్రామాల్లో నువ్వు పంట నేలకొరిగింది. మామిడి, జీడి పంటలకు నష్టం కలిగింది.

**నేలకొరిగిన పంటలు**

**సాలూరు:** మండలంలోని గురువారం రాత్రి కురిసిన ఈదురుగాలతో కూడిన వర్షానికి పంటలు నేలకొరిగాయి. ముఖ్యంగా జీగిరాం, మామిడిపల్లి, కొట్టుపరువు తదితర ప్రాంతాల్లో మొక్కజొన్న, పామాయిల్, అరటి పంటలు నేల వాలగా, జీడి, మామిడి కాయలు నేలరాలాయి. దీనితో రైతులు లబోదిబోమంటున్నారు.

### వ్యక్తిగత ఆరోగ్య డేటా కీలకం

**విజయనగరం అర్బన్:** ఆరోగ్య సంరక్షణ నిర్వహణను మెరుగుపరచడానికి వ్యక్తిగత ఆరోగ్య డేటా బేస్ నిర్వహణ కీలకంగా నిలుస్తోందని అంతర్జాతీయ శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌తివార్ అన్నారు. గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలో హెల్త్ ఎకో సిస్టమ్‌ను ప్రోత్సహించడానికి ఇద్దరు శాస్త్రవేత్తలు పని చేస్తున్నారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన హ్యాకథాన్ టెక్నో సదస్సును సందర్శించారు. శాస్త్రవేత్తలను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్‌డీసీ ) రీజనల్ మేనేజర్ డాక్టర్ విజయ్‌కుమార్ సాహూ, బ్రెయిన్ ఓ విజన్ సీఈఓ డి.గణేష్ నాగ్, జర్మనీ, యూరోపియన్ యూనియన్ నుంచి వచ్చిన పలువురు శాస్త్రవేత్తలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# కడసారి చూసేందుకు వెళ్తూ...

**విజయనగరం క్రైమ్:** చనిపోయిన వ్యక్తిని కడసారి చూసేందుకు ఆటోలో విజయనగరం వైపు వస్తున్న వారిని వీటీ అగ్రహారం లారీ కాటా టర్నింగ్ వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. దీనికి సంబంధించి రూరల్ ఎస్‌ఐ బి.గణేష్ శుక్రవారం అందించిన వివరాలు... విశాఖలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గొర్లె పైడిరాజు కసిరెడ్డి ఎల్లమ్మ, కోంద్రు తొడమ్మ, భరత్ రాయ్‌లు బొండపల్లి మండలం ఒంపిల్లి గ్రామానికి ఆటోలో బయలుదేరారు. ఒంపిల్లిలో వారి బంధువు చనిపోవడంతో కడసారి చూసేందుకు శుక్రవారం వేకువజామున ఆటోలో బయలుదేరారు. ఆటోను వీటీ అగ్రహారం వద్ద విజయనగరం నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ కాటా వైపు టర్నింగ్ తిరిగింది. టర్నింగ్ తిరిగే ప్రక్రియలో అటుగా వస్తున్న ఆటోను గమనించకపోవడంతో ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారు చెల్లాచెదురయ్యారు. సమీపంలో ఉన్న స్థానికులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మొయిద ఆదిబాబు క్షతగాత్రులకు సపర్యలు చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ టీవీ.తిరుపతిరావు, ఎస్‌ఐ బి.గణేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కేంద్రాస్పత్రికి తరలించారు. ముగ్గురు మహిళలతో పాటూ ఆటో డ్రైవర్ నరవ సన్నిబాబు తీవ్ర గాయాల పాలయ్యారు. భరత్ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కి వైద్యులు రిఫర్ చేశారు. దీంతో ఆయన్ను విశాఖకి పోలీసుల సహకారంతో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ గణేష్ తెలిపారు.



రోడ్డుపైకి తుళ్లపడి తీవ్ర గాయాల పాలైన మహిళ, పక్కన పడి ఉన్న డ్రైవర్ సన్నిబాబు



ఆటోలోనే ఇరుక్కుపోయిన మహిళలు

## క్లుప్తంగా

### నీలమణిదుర్గ ఉత్సవాలకు కమిటీలు



ఉత్సవాలపై చర్చిస్తున్న గ్రామపెద్దలు

పాతపట్నం: పాతపట్నం గ్రామ దేవత నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు మే 21 నుంచి 30 వరకు జరగనున్న నేపథ్యంలో వివిధ కమిటీలను గ్రామపెద్దలు నియమించారు. శుక్రవారం మార్కెట్ ఎదురుగా ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్‌లో అమ్మవారి ఉత్సవాలపై గ్రామ పెద్దలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ఉత్సవాలకు శానిటేషన్ కమిటీలు, శాంతిభద్రతలు, తాగునీరు అందించడంతో పాటు పూజా కమిటీలు ముఖ్యమైనవని, ఇవి ప్రధాన కమిటీకి అనుబంధంగా పనిచేయాలన్నారు. అనంతరం శాంతినగర్-3లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామపెద్దలు ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కలిసి ఉత్సవ ఏర్పాట్లు వివరించారు.

### విద్యార్థికి ఆర్థిక సాయం



మణికంఠను అభినందిస్తున్న నాయకులు

లావేరు: జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో రణస్థలం మండలం చిల్లపేటరాజాం గ్రామానికి చెందిన కొంతల మణికంఠ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము సమక్షంలో సత్కారం అందుకోనున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ మాజీ మండల కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు శుక్రవారం మణికంఠను అభినందించారు. పేద కుటుంబం కావడంతో ఢిల్లీ వెళ్లేందుకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్ డి.జానకిరావు, కొత్తకోట, గోవిందపురం మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, లావేరు హైస్కూల్ పీఎంసీ చైర్మన్ లంకలపల్లి మల్లేశ్వరరావు, యందవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### బీజేపీ పాలనలో రాజకీయ దాడులు



పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహిస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్పకూలిందని, అన్ని వర్గాలపై రాజకీయ కక్ష దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞానభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై అనర్హత వేటు రాజకీయ కక్షలో భాగమేనన్నారు. అనంతరం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డుల ఉద్యమం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పిరిడి భగత్ శివకుమార్, మణికంఠ, సనపల అన్నాజీరావు, దేశ్ల గోవింద మల్లిబాబు, పప్పల వెంకటరమణ, అంబటి కృష్ణారావు, పైడి నాగభూషణరావు, లఖినేన నారాయణరావు, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### రాళ్లకుప్పపై పడి వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: మండలంలోని రావివలసకు చెందిన దాసరి కామేశ్వరరావు (57) శుక్రవారం రాళ్లకుప్పపై పడి మృతిచెందాడు. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కామేశ్వరరావు దివ్యాంగుడు. కొద్దిరోజుల క్రితం కొన్ని మేకలు కొనుగోలు చేశాడు. శుక్రవారం మేకలను తోటలోకి మేతకు తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో మేకలు అతన్ని ఈడ్చుకుంటూ వెళ్లడంతో సమీపంలోని రాళ్లకుప్పపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య ధనరాజులు, కుమార్తె ఉన్నారు.

### ప్రభుత్వ నిర్ణయంతో అధ్యాపకులకు మేలు

మందస: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జూనియర్ అధ్యాపకులకు మేలు జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర సలహాదారులు చింతాడ శరత్ బాబు, బాడ మోహన్ అన్నారు. హరిపురంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, జవాబు పత్రాల మూల్యాంకనం ధరలను సవరించాలని రెండేళ్లుగా జీజేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వి.రవి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్నవిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి చీఫ్ ఎగ్జామినర్‌కు రూ.800, అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు పేపర్‌కు రూ.23.66, చీఫ్ సూపరింటెండెంట్‌కు రూ.352, డిపార్ట్‌మెంటల్ అధికారి, స్క్వాడ్ మెంబర్‌కు రూ.313 మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. సవరించిన రేట్ల ఉత్తర్వులు జారీ చేసిన ఇంటర్‌బోర్డు కమిషనర్ ఎం.వి.శేషగిరిబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

### సోలార్ పంపుసెట్ వైర్లు చోరీ

కొత్తూరు: మండలంలోని కల్లెమ్మ, కొత్తూరు గ్రామాలకు చెందిన రైతుల సోలార్ వ్యవసాయ పంపు సెట్ల డీసీ సిల్వర్ వైర్లు, ఇతర సామగ్రి ఈ నెల 6న చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధిత రైతులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.గోవింద తెలిపారు. దుండగలను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

# అక్రమాలపై ఆరా



వీఆర్ గూడెం గారపేట కృష్ణాపురం కొండలో కూన రవికుమార్ అండ్‌కో నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్ క్వారీలో బగాది మణికంఠ అనే యువకుడు మరణించి ఉన్న దృశ్యమిది. ఇక్కడ జరుగుతున్న అక్రమాలు బయట ప్రపంచానికి తెలుస్తాయన్న ఉద్దేశంతో క్వారీలో పని చేస్తున్న యువకుడిని లారీతో తొక్కి చంపేశారన్న ఆరోపణలతో కూడిన అనుమానాలు ఉన్నాయి.



టీడీపీ నాయకులు నిర్వహిస్తున్న అక్రమ క్వారీలో బగాది మణికంఠ మరణిస్తే అతడి మృతదేహాన్ని అక్కడికి కిలోమీటరున్నర దూరంలో ఉన్న ఒక రోడ్డు వద్దకు తీసుకొచ్చి పడేసి, దాని పక్కనే లారీని పెట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. మరణించింది ఒక చోటైతే.. ప్రమాదం మరో చోట జరిగినట్టుగా జనాల్ని నమ్మించారు.

- అక్రమ మైనింగ్‌లో యువకుడి మరణంపై ప్రభుత్వం సీరియస్
- సీఐడీ విచారణ జరపాలని సీఎంఓను కోరిన స్పీకర్
- స్పీకర్ ఫిర్యాదు పరిశీలించి, విచారణకు సీఐడీకి లేఖ రాసిన సీఎం కార్యదర్శి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : పొందూరు మండలం వీఆర్ గూడెం సమీపంలోని గారపేట కృష్ణాపురం గ్రామ కొండపై జరుగుతున్న అక్రమ మైనింగ్ క్వారీలో యువకుడు మరణించిన ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అక్రమ మైనింగ్ జరపడమే కాకుండా ఒక యువకుడిని హత్య చేశారన్న ఆరోపణల నేపథ్యంలో మొత్తం ఘటనపై సీఐడీ విచారణ జరపాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎంఓ నుంచి హోమ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆదేశాలు వెళ్లాయి. దీంతో తీగ లాగితే డొంక కదిలినట్టు.. సమగ్ర విచారణ జరిపితే అక్కడ జరిగే కుట్ర అంతా బయటపడుతుందని బాధిత వర్గాలు భావిస్తున్నాయి. యువకుడు మరణించిన తీరు, మృతదేహాన్ని ఇంకో చోట పడేసిన వైనంపై స్థానికులకే కాదు బాధితులకు కూడా అనుమానం వచ్చి ఆరా తీయగా ఇదంతా కుట్ర పూరితంగా జరిగిన ఘటనగా నిర్ధారణకు వచ్చారు. లోతుగా ఆరా తీసే సరికి బగాది మణికంఠను హత్య చేసి రోడ్డు మీద పడేసి ప్రమాదంగా చిత్రీకరించారని భావించారు. మరణించిన రోజునే బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

**అక్రమ మైనింగే కారణం**

వీఆర్ గూడెంలో దాదాపు 410 ఎకరాల విస్తీర్ణంలో కొండ ఉంది. ఈ కొండ వద్ద కూన రవికుమార్‌కు స్టోన్ క్రషర్ ఉంది. దాన్ని ఆనుకుని ఉన్న కొండ భాగంలో అక్రమ తవ్వకాలు జరిపి గ్రావెల్, రాళ్లను తరలిస్తున్నారు. కూన రవిని చూసుకుని వారి అనుచరులు సైతం కొండ చుట్టూ అక్రమ మైనింగ్ క్వారీలు నడుపుతున్నారు. ప్రతి రోజూ వందలాది వాహనాల తో ఇక్కడి నుంచి గ్రావెల్, రాళ్లు తరలించి కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఇవన్నీ చదువుకు న్న బగాది మణికంఠకు తెలియడం, ఆ యువకుడికి, క్వారీ నిర్వాహకులకు ఏదో తేడా వచ్చిందని, అక్కడ విషయాలన్నీ బయట ప్రపంచానికి తెలిసే అవకాశం ఉందనే అభిప్రాయంతో మణికంఠను లారీతో తొక్కి చంపేసి ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి. ప్రమాదవశాత్తు మరణిస్తే మృతదేహాన్ని క్వారీలోనే ఉంచాలి. బాధితులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కానీ క్వారీలో ఉన్న మృతదేహాన్ని అక్కడికి కిలోమీటరున్నర దూరంలోని ఒక రోడ్డు వద్దకు తీసుకెళ్లి, అక్కడ పడేసి దాని పక్కనే లారీని పెట్టడం బాధి తులు, స్థానికుల అనుమానాలకు బలమిచ్చింది.

# కిడ్నీ బాధితులకు అండగా..!



త్వరలో అందుబాటులోకి రానున్న కిడ్నీ డయాలసిస్ కొత్త వార్డు

- రిమ్స్‌కు మరో మూడు డయాలసిస్ యంత్రాలు
- అతి త్వరలో అందుబాటులోకి సేవలు
- ఇప్పటికే కీలక సేవలందిస్తున్న డయాలసిస్ కేంద్రం



డయాలసిస్ సేవలు పొందుతున్న కిడ్నీ బాధితులు

శ్రీకాకుళం: కిడ్నీ రోగులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో 20 పడకల డయాలసిస్ కేంద్రం పనిచేస్తుండగా, దీని ద్వారా ప్రతి రోజు 50 మందికి పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. న్యూరాలజీ, నెఫ్రాలజీ వైద్య నిపుణులు రిమ్స్‌లో అందుబాటులో ఉండటంతో కిడ్నీ రోగులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయి. ప్రైవేటుగా డయాలసిస్ చేయించుకునేందుకు రూ.6 వేలు నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుంది. రిమ్స్‌లో డయాలసిస్ కేంద్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా డయాలసిస్ చేస్తున్నారు.

**మరో మూడు యంత్రాలు సిద్ధం..**

రిమ్స్‌లో త్వరలోనే మరో మూడు డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఐసీఐసీఐ బ్యాంకు ఈ యంత్రాలను సమకూర్చింది. వీటిని అమర్చేందుకు అవసరమయ్యే గదులను, పడకలను రిమ్స్ అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేశారు. దీని నిర్వహణకు ఒక ఆర్వో ప్లాంట్, మరికొన్ని కెమికల్స్ అవసరం కావటంతో రూ.8లక్షలు మంజూరు చేయాలని జిల్లా అధికారులకు నివేదించారు. ఈ మూడు యంత్రాలు అందుబాటులోకి వస్తే రోజుకు మరో పది మందికి అదనంగా డయాలసిస్ సేవలు అందించే అవకాశం లభిస్తుంది.

**పలాస రీసెర్చ్ కేంద్రంలో..**

ఉద్దానం ప్రాంతంలో కొన్ని దశాబ్దాలుగా కిడ్నీ వ్యాధి ప్రబలుతుండటంతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ కేంద్రంతో పాటు 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసే పనులను సీఎం జగన్ మోహన్ రెడ్డి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఇప్పుడు నిర్మాణ పనులు పూర్తయి మరో రెండు నెలల్లో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆస్పత్రిలో వైద్యుల పోస్టులు భర్తీకి రాష్ట్ర స్థాయిలో ఇంటర్వ్యూలు కొద్దిరోజుల క్రితమే పూర్తయ్యాయి. టెక్నీషియన్లు, గుమస్తాలు, సెక్యూరిటీ గార్డులు, ల్యాబ్ టెక్నీషియన్లతో పాటు మరికొన్ని విభాగాల్లో పోస్టుల భర్తీకి జిల్లా స్థాయిలో వారం రోజుల క్రితమే నోటిఫికేషన్ విడుదలైంది. మరో వారం రోజులు ఎంపికలు పూర్తి చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇవి పూర్తయితే పలాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రత్యేక కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలతో పాటు డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. గత ప్రభుత్వం కిడ్నీ వ్యాధిగ్రస్తుల పట్ల నిర్లక్ష్యం వహించి సర్వేలతోనే కాలయాపన చేసింది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పరిశోధనలు చేస్తూనే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంపై కిడ్నీ రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**త్వరలోనే సేవలు**

రిమ్స్ ఆస్పత్రిలో త్వరలోనే మరో మూడు డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు పూర్తయితే యంత్రాలు అందుబాటులోకి వస్తాయి. పలాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పోస్టుల భర్తీకి జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు.

– డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్, రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్, శ్రీకాకుళం

## వైభవంగా హాటకేశ్వరుని యాత్రా మహోత్సవం



నందీశ్వరుడిని ఊరేగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సింగుపురంలో కొలువైన పార్వతీ కొండమ్మ సమేత హాటకేశ్వర స్వామి కల్యాణ యాత్ర మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మార్చి 28 నుంచి జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా నందీశ్వరున్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ధాన్యం తోరణాలు, పండ్ల తోరణాలు కట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉత్సవమూర్తులు

## స్వాగతద్వారాన్ని ఢీకొట్టిన లారీ



లారీపై కూలిన స్వాగత ద్వారం

మందస: మేజరు పంచాయతీ మందసలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా స్వాగత ద్వారం(ఆర్చి) కూలిపోయింది. మందస పట్టణంలోని వీధుల్లోకి అనధికారికంగా పెద్ద, పెద్ద లారీలు, వాహనాలు ప్రవేశిస్తున్నాయి. ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా గంటలకొద్దీ నిలిపేస్తున్నారు. స్థానిక శాసనాం వీధి ప్రారంభంలో అన్నపూర్ణమ్మతల్లి స్వాగత ద్వారాన్ని గతంలో నిర్మించారు. శనగకాయల లోడుతో పెద్దలారీ వీధిలోకి ప్రవేశించడానికి డ్రైవర్ ప్రయత్నం చేయగా.. ఆర్చికి లోడు తగిలి కూలిపోయింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదే ప్రదేశంలో ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగి ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బ తినడంతో మంటలు, పొగలు వచ్చాయి. సకాలంలో విద్యుత్ నిలిపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు సకాలంలో స్పందించి డ్రైవర్, క్లీనర్లను రక్షించారు. ఈ తరుణంలో లారీ పక్క నుంచి ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి తాడు చుట్టుకోవడంతో గాయపడ్డాడు. అతికష్టమ్మీద లారీని బయటకు తీసి రాకపోకలు పునరుద్ధరించారు.

### తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



దహన సంస్కారాలు చేస్తున్న ధనలక్ష్మి

టెక్కలి రూరల్: మండల కేంద్రం టెక్కలిలోని పట్టుమహాదేవి కోనేరు గట్టుపై నివాసముంటున్న గంట మల్లేష్(60) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. ఇతనికి కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె అక్కిరెడ్డి ధనలక్ష్మి తండ్రి చితికి నిప్పంటించి దహన సంస్కారాలు పూర్తి చేసింది. మల్లేష్ టెక్కలిలో పండ్లు అమ్ముకుంటూ జీవించేవాడు. ఈయన మృతికి సంతాపంగా తోటి వ్యాపారులు శుక్రవారం బంద్ చేపట్టారు.

### క్యాన్సర్ బాధిత చిన్నారికి చేయూత



కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న జేసీబీ యూనియన్ సభ్యులు

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం పంచాయతీ చిన్నశ్రీరాంపురం గ్రామానికి చెందిన ఐదేళ్ల లండ యోగేంద్ర న్యూరోబ్లాస్టోమా అనే క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయమై ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో దాతలు స్పందిస్తున్నారు. కంచిలి మండల జేసీబీ వాహనాల యూనియన్ సభ్యులు స్పందించి సర్పంచ్ బల్లెడ సుమన్, బృందావన్ సమక్షంలో శుక్రవారం రూ.27వేలను కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పోలయ్య, చంద్రయ్య, గజేంద్ర, ఢిల్లీ, జానీ, ప్రదీప్, చంటి తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా ఇంటర్ మూల్యాంకనం



మూల్యాంకన ప్రక్రియలో ఎగ్జామినర్లు, సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలతోపాటు సమీపంలోని ఆర్‌సీఎం సెయింట్ జాన్స్ జూనియర్ కళాశాల కేంద్రాలుగా ఇంటర్ స్పాట్ జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే శుక్రవారంతో నాలుగు సబ్జెక్టుల స్పాట్ ముగిసింది. హిందీ, ఎకనామిక్స్, సివిక్స్, హిస్టరీ సబ్జెక్టుల పేపర్-1, పేపర్-2 జవాబుపత్రాల దిద్దుబాటు పూర్తయింది. దీంతో ఆయా ఎగ్జామినర్లు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ రిలీవ్ అయ్యారు. శనివారంతో ఆ నాలుగు సబ్జెక్టుల చీఫ్ ఎగ్జామినర్లు, స్క్రూటినైజర్లు రిలీవ్ కానున్నారు.

**కామర్స్ స్పాట్ వాయిదా..**

ఈ నెల 8వ తేదీ నుంచి నాల్గో, ఆఖరి విడత స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ మొదలుకానుంది. ఆఖరి విడతలో కామర్స్, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల దిద్దుబాటు జరగాల్సి ఉంది. అయితే బోటనీ, జువాలజీ దిద్దుబాటు యథావిధిగా జరగనుండగా.. కామర్స్ దిద్దుబాటు మాత్రం ఈనెల 10వ తేదీ నాటికి వాయిదా పడింది. కామర్స్ ఎగ్జామినర్లు ఈనెల 10వ తేదీన రిపోర్ట్ చేయనున్నారు. స్పాట్ కేంద్రంలో వసతి సమస్య కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు క్యాంప్ ఆఫీసర్/ఆర్‌ఐఓ ఎస్.తవిటి నాయుడు తెలిపారు. జిల్లా పరిశీలకులు, డీవీఈఓ కోట ప్రకాశరావు నేతృత్వంలో జనరల్-1 బి.శ్యామ్ సుందర్, జనరల్-2 కీర్తి తవిటినాయుడు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

## సమష్టి కృషితో చెరువుల అభివృద్ధి



వేతనదారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

మెళియాపుట్టి: ఉపాధి హామీలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమృత్ సరోవర్ కింద చెరువులను అభివృద్ధి చేసుకోవడానికి గ్రామ ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని శ్రీకాకుళం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు జీవీ చిట్టిరాజు అన్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ ద్వారా జరుగుతున్న అమృత్ సరోవర్ చెరువును పరిశీలించారు. అన్ని గ్రామాల్లో అమృత్ సరోవర్ చెరువుల ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని, సాయంత్రం సమయాల్లో పిల్లలు, వృద్ధులు సేదతీరడానికి ఉపయోగపడటమే కాకుండా గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి ఇది మొదటి మెట్టు అని అన్నారు. అనంతరం వేతనదారులతో మాట్లాడారు. వేసవి తీవ్రత నేపథ్యంలో చల్లటి సమయాల్లో కనీసం రోజుకు ఆరు గంటల పాటు పనిచేయాలని అన్నారు. నిర్దిష్ట వేతనం వచ్చేవిధంగా సిబ్బంది కొలతలు ఇవ్వాలని అన్నారు. వేతనదారులు చేసిన పనిని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ ఈశ్వరమ్మ, సర్పంచ్ బైపోతు ఉదయ్‌కుమార్, డ్వామా సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

## జిల్లా సీనియర్స్ క్రికెట్ జట్టు ఎంపిక రేపు



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా సీనియర్స్ పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలను ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం శ్రీకాకుళం ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఆరోజు ఉదయం 8 గంటలకు ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, తదితర పత్రాలతో హాజరుకావాలన్నారు. అలాగే క్రీడాకారులు తెలుపురంగు యూనిఫాం, షూ విధిగా ధరించి హాజరుకావాలని ముస్తాక్ కోరారు. మరిన్ని వివరాలకు ఆర్సీ రెడ్డి (85550 78215), కెఎస్ఎం శైలానీ (92466 31797), కోచ్ సుదర్శన్‌ను సంప్రదించాలన్నారు.

## గల్ఫ్ దేశాల్లో ఉపాధికి మహిళలకు అవకాశం

ఎచ్చెర్ల క్యాంపస్: గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ చెప్పారు. ఎచ్చెర్లలోని స్కిల్ కాలేజీలో వివరాలను శుక్రవారం వెల్లడించారు. మహిళలకు హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించనున్నట్లు వివరించారు. ప్రభుత్వం నేరుగా అవకాశాలు కల్పిస్తుందని, గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం నకిలీ ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని అన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ఈ నెల 9లోగా కోఆర్డినేటర్ జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఫోన్ నంబర్ 8790500572ను సంప్రదించాలని చెప్పారు. చదవటం, రాయటం తెలిసిన 18 నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలు అర్హులని తెలిపారు. ఈ ఎంపిక ద్వారా వెళ్లిన వారికి ఉద్యోగ భద్రత, ఇతర ఇబ్బందులు భారత రాయబార కార్యాలయం పర్యవేక్షిస్తుందని వివరించారు.

## ‘రోజుకు 300 రాళ్లు పాతాలి’



సర్వే రాళ్లు పాతే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేసీ నవీన్

సారవకోట: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రోవర్లు గుర్తించిన ప్రదేశాలలో రోజుకు 300 సర్వే రాళ్లు పాతాలని జాయింట్ కలెక్టర్ నవీన్ కుమార్ సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని అంగూరు రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న జగనన్న భూ సర్వేలో సర్వే రాళ్లు పాతే కార్యక్రమాన్ని పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 10 గ్రామాల్లో రాళ్లు పాతే కార్యక్రమం జరుగుతోందని, ప్రస్తుతం అంగూరు, కూర్మనాథపురం గ్రామాల్లో సర్వే రాళ్లు పాతేందుకు 4,662 రాళ్లు అందుబాటులో ఉన్నాయని, 6 రోవర్లు కూడా ఉన్నాయని ఆ రోవర్ల సూచనల మేరకు రోజుకు 300 చొప్పున రాళ్లు పాతాలన్నారు. ఆయనతో పాటు సర్వే శాఖ ఏడీ ప్రభాకరరావు, తహసీల్దార్ ప్రవల్లికా ప్రియ, మండల సర్వేయర్ ఓ మహేశ్, వీఆర్వో కేధారి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## ముఖలింగేశ్వరుని సన్నిధిలో విజయనగరం ప్రిన్సిపల్ జడ్జి



వారాహి అమ్మవారికి కుంకమ పూజలు నిర్వహిస్తున్న జడ్జి కల్యాణ చక్రవర్తి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని మధుకేశ్వరుడిని విజయనగరం జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి కల్యాణ చక్రవర్తి శుక్రవా రం దర్శించుకున్నారు. అర్చకులు గణపతి పూజతో ప్రారంభించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి స్వామి దర్శనం చేయించారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు.

## భావనపాడు పోర్టు శంకుస్థాపనకు స్థల పరిశీలన



పోర్టు శంకుస్థాపన ప్రాంతాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు

సంతబొమ్మాళి:

మండలంలోని మూలపేటలో భావనపాడు పోర్టు శంకుస్థాపనకు అనువైన స్థలాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబరీష్, కాశీబుగ్గ డీఎస్పీ శివరామిరెడ్డిలు శుక్రవారం పరిశీలించారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగే హెలీప్యాడ్ స్థలాన్ని, వసతి స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ నెల 19వ తేదీన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావనపాడు పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. కార్యక్రమంలో తహసీల్దార్ చలమయ్య, స్థానిక సర్పంచ్ జీరు బాబూరావు తదితరులు ఉన్నారు.